సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 5 । డిసెంబర్ । 2024



మేధోమథనం

4లో


ప్రతిష్టాత్మక ప్లాస్టిక్ సర్జరీ సదస్సుకు కాకినాడ వేదిక కానుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వైద్య ఉద్దండులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు.

భీమేశ్వరాలయ అన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన ట్రస్ట్‌కు స్థానికులు ముప్పనపల్లి రామతులసి బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆమె కుమారుడు, గణేష్, మనవడు భార్గవ కృష్ణ చెక్ అందించారు.

డెల్టా కాలువలకు 6,600 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 400, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

త్వరలో వైఎస్సార్ సీపీ కమిటీల నియామకం



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుకు అనుబంధ విభాగాల బుక్‌లెట్లను అందజేస్తున్న శివారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో అనుబంధ కమిటీల నియామకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. బుధవారం ఆయన నివాసంలో చెల్లుబోయిన వేణుకు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల బుక్‌లెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి చెల్లుబోయిన వేణుతో కొద్దిసేపు చర్చించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర రెడ్డి సూచనల మేరకు కమిటీల నియామకాలకు పార్టీ అధిష్టానం శ్రీకారం చుట్టినట్లు ఆయనకు వివరించారు. త్వరితగతిన అనుబంధ కమిటీల నియామకాలు పూర్తి చేయాలన్న పార్టీ అధినేత వైఎస్ జగన్ సూచనలను శివారెడ్డి చెల్లుబోయిన వేణుకు వివరించారు.

10 శాతం రాయితీతో ఏసీ బస్సు సర్వీసులు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నుంచి రాత్రి 9 గంటలకు హైదరాబాద్ బయలుదేరే ఇంద్ర ఏసీ సర్వీసుకు డిసెంబర్ 31 వరకు 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఒ.షబ్నం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి రాత్రి 7:15 గంటలకు రాజమహేంద్రవరం బయలుదేరే ఇంద్ర ఏసీ సర్వీసుకు కూడా 10 శాతం రాయితీ కల్పించామన్నారు. శనివారం, ఆదివారం రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్ వెళ్లే సర్వీసుకు, శుక్రవారం హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వచ్చే సర్వీసుకు ఈ రాయితీ వర్తించదన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డి.నరసింహాకిశోర్ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఎస్పీ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాలు, తీసుకున్న భద్రతా చర్యలు పోలీసు అధికారులతో సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకున్న ఏర్పాట్లను అధికారులతో కలసి పరిశీలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- తూర్పుగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 2,904 మంది ఓటర్లు
- 9న కాకినాడలో కౌంటింగ్
- ప్రశాంతంగా నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు
- ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి



ఎన్నికల నిర్వహణపై సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, రాజమహేంద్రవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. గురువారం నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ ఉంటుంది. 9వ తేదీ కాకినాడలో ఫలితాలు వెల్లడిస్తారు. పూర్వపు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని ఉప ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బంది ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. పోలింగ్ సిబ్బంది ఎనిమిది రూట్లలో ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు.

జిల్లా వ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాలు

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2,904 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందులో పురుషులు 1,597, మహిళలు 1,307 ఉన్నారు. ఎన్నికలు జరిగే కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు(11 మండలాలు) పరిధిలో మొత్తం 113 మండలాలుండగా.. 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 16,316 మంది ఓటర్లున్నారు. పోటీలో ఐదుగురు అభ్యర్థులు ఉన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

ఎన్నికలకు అవసరమైన సామగ్రిని బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సిబ్బందికి అందజేశారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లినట్లు చెప్పారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పోలింగ్ సామగ్రి ఆర్ట్స్ కళాశాలకు తరలించనున్నట్లు తెలిపారు. బ్యాలెట్ బాక్స్, ఇతర పత్రాలు భద్రపరచనున్నట్లు తెలిపారు. అనంతరం వాటిని భద్రత మధ్య కాకినాడకు తరలిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

వివరాలు ఇలా..

మండలం	పోలింగ్ కేంద్రం
రంగంపేట	తహసీల్దార్ కార్యాలయం
గోకవరం	ఎంపీడీఓ కార్యాలయం
సీతానగరం	ఎంపీడీఓ కార్యాలయం
రాజమహేంద్రవరం అర్బన్	అర్బన్ తహసీల్దార్ కార్యాలయం (తూర్పుగోదావరి వైపు)
రాజమహేంద్రవరం అర్బన్	తహసీల్దార్ కార్యాలయం (పశ్చిగోదావరి వైపు)
రాజమహేంద్రవరం రూరల్	శ్రీమతి బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్ (హుకుంపేట)
రాజానగరం	మండల మహిళా సమాఖ్య మీటింగ్ హాల్
కడియం	ఎంపీడీఓ కార్యాలయం
బిక్కవోలు	ఎంపీడీఓ కార్యాలయం
అనపర్తి, గోపాలపురం, కొవ్వూరు	ఎంపీడీఓ కార్యాలయం
తాళ్లపూడి	శ్రీ పరసపద్మ రాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
నల్లజర్ల	ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల
దేవరపల్లి	ఎలిమెంటరీ స్కూల్
చాగల్లు	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
నిడదవోలు	ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల
ఉండ్రాజవరం	తహసీల్దార్ కార్యాలయం
పెరవలి	మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల

అధినేతకు కృతజ్ఞతలు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కర్తగా తన కుమారుడు ముద్రగడ గిరిబాబును నియమించిన నేపథ్యంలో తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాష్ట్ర కాపు జేఏసీ మెంబర్ – వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ తదితరులు ముద్రగడ వెంట ఉన్నారు.

పురాణ జ్ఞానంతో సంశయాల నివృత్తి



త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

రాజమహేంద్రవరం రూరల్: మన సంశయాలను పురాణాల ద్వారా నివృత్తి చేసుకోవాలని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అభిభాషించారు. రాజవోలు గాయత్రీనగర్‌లోని రామాలయం దగ్గర శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి మంగళా శాసనాలతో అహోబిల రామానుజ జీయర్ స్వామి ఈ నెల 11వ తేదీ వరకు భాగవతంపై చేయనున్న ఆధ్యాత్మిక ప్రసంగాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు జరిగే ప్రవచనాలలో భాగంగా తొలిరోజు అహోబిల రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేసి భాగవత సప్తాహానికి శ్రీకారం చుట్టారు. వేదాల్లో సమస్తం ఉందని, అయితే వేదం చదివితే సరిపోదని దానర్థం తెలియాలని అన్నారు. వేదం అంటే కేవలం మంత్రాలని, వేదానికి శృతి అనే పేరు ఉందని, దీన్ని ఆధారం చేసుకుని ఋషులు స్మృతి ద్వారా అందులో అర్థాన్ని చెప్పారని, వాటిని స్మృతి గ్రంథాలు అంటారని తెలిపారు. వాటిని మరింత విస్తరించి ఇతిహాసాలు చెప్పారని వీటిని అనుసరించి రామాయణ, మహాభారతాలు, పురాణం, ఆగమం, ప్రబంధాలు వచ్చాయని, ఇవన్నీ వేదాన్ని, వేదంలో ఉండే అర్థాన్ని, వాటి వైభవాన్ని చెబుతాయని వివరించారు. వ్యాసులవారు సాక్షాత్తూ విష్ణువు అవతారమని అన్నారు. ఎన్ని గ్రంథాల ద్వారా చెప్పినా మనుషుల్లో మార్పు రాకపోవడం వ్యాసుడు గ్రహించాడన్నారు. ఎందులోనూ దేవుని వైభవం పూర్తిగా చెప్పలేదని, పరమాత్మ గురించి సంకీర్తన చేయాలని, భగవంతుని గుణవైభవం వినేకొద్దీ మనిషి చాలా గొప్పవాడవుతాడని అందుకు తానే ఉదాహరణ అని నారదుడు ఉపదేశించాడని అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. అంతేకాదు, నాలుగు శ్లోకాలు చెప్పగా, వ్యాసుడు వాటి ఆధారంగా 18వేల శ్లోకాల భాగవతాన్ని అందించాడని తెలిపారు. బొమ్మూరు వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

11న యువ ఉత్సవ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా స్థాయి యువ ఉత్సవాల్లో యువత పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా యువ ఉత్సవ్‌కి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రంగాలలో యువతను ప్రోత్సహించడంతో పాటు, వారిలో నిక్షిప్తమై ఉన్న ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా యువ ఉత్సవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో రాజానగరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 11న జిల్లా యువ ఉత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ జిల్లా యువ ఉత్సవ్‌లో (ఇండియా - 2047) అనే అంశంపై స్పీచ్, పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ విభాగాలలో వ్యక్తిగత పోటీలు, కల్చరల్, ట్రెడిషనల్, ఫోక్ (గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ అంశాలలో గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి క్రీడలకు పంపుతామన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి దూలం కిషోర్ వివరాలు తెలియజేస్తూ ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. వివరాలకు 70954 12584 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భక్తులు పోలీసులకు సహకరించాలి

- షష్ఠి ఉత్సవాలు విజయవంతం చేద్దాం
- ఎస్పీ కిషోర్



షష్ఠి ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఎస్పీ కిషోర్

బిక్కవోలు: భక్తులు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ డీఎన్ కిషోర్ అన్నారు. బుధవారం మండలంలోని బిక్కవోలు గ్రామంలో నిర్వహించే షష్ఠి ఉత్సవాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 12 వరకు శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం ట్రాఫిక్ మళ్లిస్తామన్నారు. వీఐపీ, రూ.50, రూ.10, ఉచిత దర్శనం క్యూ ఏర్పాటు చేశారన్నారు. ముందుగా ఉదయం స్నానఘట్టం, బాణసంచా కాల్చే ప్రదేశాలను ఎస్పీ పరిశీలించారు. శ్రీలక్ష్మీ గణపతి ఆలయం, శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఈవో రామలింగ భాస్కర్, ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లివాసు ఆయనకు జ్ఞాపికను అందించారు. అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్, అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొర్రెల తిమూర్తులు పాల్గొన్నారు.

కార్తిక మాసం.. కాసుల వర్షం

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- నెల రోజుల్లో అంచనాకు మించిన ఆదాయం
- కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- అగ్రస్థానంలో వాడపల్లి వెంకన్న



వాడపల్లి వెంకన్న ఆలయంలో నగదు లెక్కింపు (ఫైల్)

సాక్షి, అమలాపురం: కార్తిక మాసంలో జిల్లాలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ప్రముఖ శైవ క్షేత్రాలతో పాటు ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అభిషేకాలు, పూజలు, హోమాలు, ప్రత్యేక దర్శనాలు, అన్నదానాలకు విరాళాలు, ప్రసాదాల అమ్మకాల ద్వారా దేవదాయ శాఖతో పాటు ప్రైవేటు ఆలయాలకు అంచనాలకు మించి ఆదాయం లభించింది. ద్రాక్షారామం భీమేశ్వర స్వామి, కోటిపల్లి సోమేశ్వరస్వామి, మురమళ్ల వీరేశ్వర స్వామి, వానపల్లి ఉమా కొప్పేశ్వరస్వామి, ముక్తేశ్వరం ముక్తకాంత క్షణ ముక్తేశ్వరస్వామి, కుండలేశ్వరస్వామి ఆలయాలతో పాటు ఏకాదశ రుద్రులు కొలువుదీరిన అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం మండలాల్లోని ఆలయాలకు స్థానికులే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వీటితో పాటు వాడపల్లి వెంకటేశ్వరస్వామి, అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి, అప్పనపల్లి బాల బాలాజీ, అంతర్వేది లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయాలకు సైతం భక్తులు బారులు తీరారు.

అప్పనపల్లికి ఆదాయం



అప్పనపల్లికి భక్తుల తాకిడి

అప్పనపల్లి బాలాజీకి సైతం ఆదాయం భారీగా పెరిగింది. గత ఏడాది రూ.27,20,199 వరకు ఉండగా, ఈ ఏడాది రూ.57,45,465 వచ్చింది. గత ఏడాది కన్నా ఈ ఏడాది అదనంగా రూ.27,20,199 వరకు పెరిగింది. నెల రోజులలో స్వామివారిని 2,28,360 భక్తులు దర్శించుకున్నారు. 1,01,280 మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

వీరేశ్వరునికి కాసుల పంట



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం చేయించుకుంటున్న భక్తులు

నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థాన ఆదాయం ఈ కార్తిక మాసంలో గతేడాది కంటే అధికంగా వచ్చింది. నిత్య కల్యాణం, నిత్య, మాస, వార్షిక పూజలు అధికంగా జరిగాయి. అన్నదాన ట్రస్టుకు దాతలు విరాళాలు సమర్పించారు. ఈ ఏడాది అదనంగా రూ.6,48,816 వరకు పెరిగింది. నిత్య కల్యాణం, పంచామృతాభిషేకాలు, లఘున్యాస అభిషేకాలు, ఇతర సేవల ద్వారా రూ.41,46,652 వచ్చింది. ప్రసాదాల ద్వారా రూ.1,45,985, అన్నదాన ట్రస్ట్‌కు రూ.7,51,043 కలిపి మొత్తం రూ.50,43,680 వరకు సమకూరింది.

అంతర్వేదికి ఆదాయం



అంతర్వేదిలో బారులు తీరిన భక్తులు

ఆది దేవుడు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కార్తిక మాసంలో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ నెల రోజులూ స్వామివారి దర్శనం, సేవల రూపంలో రూ.84,81,850 వచ్చింది. దీనిలో ప్రత్యేక దర్శనానికి రూ.19,37,800, ప్రసాదం ద్వారా రూ.14,25,420, అభిషేకాలకు రూ.2,58,400, సుదర్శన హోమానికి సంబంధించి 4,37,200 సమకూరింది. నిత్యాన్నదానానికి రూ.41,12,521 విరాళాలు అందజేశారు.

పోటెత్తిన భక్తులు



కోటిపల్లి గోదావరి తీరంలో కార్తిక దీపారాధనలో పాల్గొన్న భక్తులు

కోటిపల్లి సోమేశ్వరస్వామి ఆలయాన్ని నాలుగు సోమవారాలు కలిపి సుమారు 35 వేల మంది భక్తులు సందర్శించారు. కార్తిక మాసం సందర్భంగా గోదావరి నది ఒడ్డున నిర్వహించి కార్తిక దీపారాధనకు భక్తులు పోటెత్తారు. అలాగే కుండేలేశ్వరంలోని కుండలేశ్వరం స్వామి దర్శనానికి నెల రోజుల్లో 25 వేలకు మందికిపైగా వచ్చిన భక్తుల స్థానికంగా ఉన్న త్రివేణి సంగమ ప్రాంతంలో పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు చేశారు.

వాడపల్లికి లక్ష్మీ కటాక్షం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల ప్రదక్షిణలు

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఏడాది పొడవునా భక్తులు పోటెత్తుతారు. ఈ కార్తిక మాసంలో వీరు రెట్టింపయ్యారు. ఏడు శనివారాలు, ఏడు ప్రదక్షిణల దేవునికి కార్తికం నెల రోజులు రూ.3,37,13,952 వచ్చింది. గతేడాది ఇది కేవలం రూ:2,28,83,393 మాత్రమే ఉంది. దీనిలో సేవలకు రూ.5,75,977, ప్రత్యేక దర్శనాలకు (రూ.50 దర్శనాలు) రూ.60,59,000, విశిష్ట దర్శనానికి (రూ.200) రూ.80,86,800, వేదాశీర్వచనంతో (రూ.1,116) రూ.47,54,160, అన్న ప్రసాద విరాళాల ద్వారా రూ.56,88,852, లడ్డూ విక్రయాల ద్వారా రూ.61,24,230, ఇతర విరాళాలు రూ.1,38,832, ఆన్‌లైన్ ద్వారా రూ.22,86,101 వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

పంచారామ క్షేత్రానికి భక్తుల తాకిడి

పంచారామ క్షేత్రాలలో ఒకటైన ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. రాష్ట్రం నలుమూల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చారు. కార్తిక మాసంలో ఆలయానికి టిక్కెట్ల రూపంలో రూ.1,29,37,257 వరకూ ఆదాయం వచ్చింది. రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చారు. సుమారు ఏడు లక్షల మంది వరకు భక్తులు ఉంటారని దేవాలయ అధికారులు చెబుతున్నారు. స్వామివారికి సుమారు ఎనిమిది వేల అభిషేకాలు జరిగాయి.



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

ముమ్మిడివరం: మండలంలోని క్రాప చింతల పూడిపాలేనికి చెందిన బూరుగు వెంకటేశ్వర రావు ఎలియాస్ కొండయ్య (63) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేశ్వరరావు, సత్యవతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహాలు జరిపించగా, కుమారుడు ఆరు నెలల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచీ వెంకటేశ్వరరావు మనో వేదనతో బాధపడుతున్నాడు. అతడి భార్య సత్యవతి ముమ్మిడివరం ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరరావు ఇంటి వద్ద ఉన్న మామిడి చెట్టుకు ఉరి వేసుకుని మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కీచక ఉపాధ్యాయుడి అరెస్టు

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు పిండి శ్రీనివాస్‌ను బుధవారం కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, నిర్భయ కేసులు నమోదు చేశామన్నారు. అతడిని కొత్తపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఎంటీఎస్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించిన విషయం విదితమే.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నల్లజర్ల: అనంతపల్లిలోని పోలవరం కుడి కాలువ సైఫన్ వద్ద ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతైనట్టు భావిస్తున్న మద్రి నవీన్ కుమార్ (23) మృతదేహాన్ని బుధవారం ఉదయం కాకినాడ ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం బయటకు తీసింది. సైఫన్ వంతెన కింది భాగంలోనే మృతదేహం లభించింది. నవీన్ కుమార్ బైక్, చెప్పులు, సెల్‌ఫోన్ వంతెన వద్ద ఉండడంతో సోమవారం రాత్రి అతడు గల్లంతైనట్టు భావించారు. దీంతో మంగళవారం ఏలూరు నుంచి వచ్చిన గజఈతగాళ్లు కాలువలో గాలించారు. అయినా నవీన్ కుమార్ ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసుల సూచనల మేరకు బుధవారం కాకినాడ నుంచి వచ్చిన 15 మంది ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ఆ ప్రాంతంలో గాలించి నవీన్ మృతదేహాన్ని బయటకు తీసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై మోహనరావు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం నవీన్ మృతదేహాన్ని బంధువులకు అందించారు.

మేధోమథనం

- కాకినాడలో ప్లాస్టిక్ సర్జరీ వార్షిక సదస్సు
- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- దేశ వ్యాప్తంగా 200 మంది ప్రముఖుల రాక



సదస్సు వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ కృష్ణారావు

కాకినాడ క్రైం: ప్రతిష్టాత్మక ప్లాస్టిక్ సర్జరీ సదస్సుకు కాకినాడ వేదిక కానుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వైద్య ఉద్దండులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ప్లాస్టిక్ సర్జరీ తెలుగు రాష్ట్రాల అసోసియేషన్, కాకినాడ జీజీహెచ్, ఆర్‌ఎంసీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సదస్సు నిర్వహణ వివరాలను అసోసియేషన్ నాయకత్వం తెలిపింది.

మూడు రోజుల పాటు నిర్వహణ

అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్ అండ్ ఎస్తాటిక్ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ (ఏపీఆర్‌ఏఎస్‌సీవోఎన్), కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, జీజీహెచ్ కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీఆర్‌ఏఎస్‌సీవోఎన్ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు తెలిపారు. కాకినాడ వివేకానంద పార్కులోని కుళాయి చెరువు ఆవరణలో ఉన్న ఫ్యాబిన్ కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

20 మందితో ఆర్గనైజింగ్ కమిటీ

అనుభవజ్ఞులే నిర్వాహకులుగా ఆర్గనైజింగ్ కమిటీ సిద్ధమైంది. సుమారు 300 మంది పాల్గొననున్న ఈ సదస్సు నిర్వహణను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ప్రవీణ్ పర్యవేక్షణలో కమిటీ ఆర్గనైజింగ్ చైర్మన్‌గా డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ బి.రత్నభూషణ్, ట్రెజరర్లుగా బి.సురేంద్రనాథ్, కె.శ్రీకాంత్, సైంటిఫిక్ కమిటీ సభ్యులుగా పీవీ సుధాకర్, వి.గంగాకిషోర్, డి.ప్రతాప్, పోస్టర్స్ కమిటీ సభ్యులుగా కె.సత్యసాయి ప్రసాద్, నవీన్ భరత్, రిసెప్షన్ కమిటీకి ఎంఎస్ భారతి, కె.హర్ష, షాలిని, పవన్, అకామిడేషన్ కమిటీ సభ్యులుగా టీఎస్ఎస్ సుధ, డి.రమేష్, ట్రాన్స్‌పోర్టు కమిటీ సభ్యులుగా పీఎస్ సుభాష్, రవితేజ, సందీప్, ఫుడ్ అండ్ కేటరింగ్ సభ్యులుగా కేసీవీ చలపతి, నీలిమ వ్యవహరించనున్నారు. అతిథులు ఎటువంటి అవసరం వచ్చినా సంబంధిత విభాగానికి చెందిన కమిటీ సభ్యులను సంప్రదించాలని డాక్టర్ రత్నభూషణ్ తెలిపారు.



సదస్సు జరగనున్న వేదిక ఇదే

దేశం నలుమూలల నుంచి ఫ్యాకల్టీల రాక

ప్లాస్టిక్ సర్జరీలో చోటు చేసుకున్న మార్పులు, అందుబాటులోకి వచ్చిన అధునాతన వైద్య విధానాలను వెల్లడించడానికి దేశం నలుమూలల నుంచి 10 మంది గెస్ట్ ఫ్యాకల్టీలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ముంబై, న్యూఢిల్లీ, కొల్హాపూర్, ఔరంగాబాద్, బెంగళూరు, కోయంబత్తూర్, నాగ్‌పూర్ ప్రాంతాలకు చెందిన సీనియర్ ప్లాస్టిక్ సర్జన్లు ఈ గెస్ట్ ఫ్యాకల్టీగా హాజరవుతారు. అలాగే ప్రతిష్టాత్మక సదస్సుకు పాట్రోన్స్‌గా డాక్టర్ జీవీ సుధాకర్, డాక్టర్ కె.విష్ణుమూర్తి, ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటి వైస్ ఛాన్సలర్, రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, గౌరవ అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, అతిథులుగా ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, డాక్టర్ శశి రానున్నారు.

విజ్ఞాన భరితంగా సైంటిఫిక్ సెషన్లు

సైంటిఫిక్ సెషన్ల నిర్వహణ అతిథుల విషయావగాహన, విజ్ఞాన వృద్ధికి ఎంతో ప్రయోజనం చేకూర్చనుందని డాక్టర్ విష్ణుమూర్తి తెలిపారు. డయాబెటిక్ ఫుట్, అంకో ప్లాస్టిక్ రీకన్‌స్ట్రక్షన్, హెయిర్ రీస్టోరేషన్, నబి సెషన్, హ్యాండ్ సర్జరీ, క్రానియోఫేషియల్ సర్జరీస్, సెక్స్ రీఅసైన్‌మెంట్, సూపర్ మైక్రో సర్జరీ, లేజర్స్, అబ్డామినల్ వాల్ రీకన్‌స్ట్రక్షన్, బోటోక్స్, ఫిల్లర్స్, థ్రెడ్స్, క్యాడీవెర్, కాస్మోటిక్ బ్రెస్ట్ ప్రొసీజర్స్, లైపోసెక్షన్ అంశాలపై పలు రాష్ట్రాల నుంచి వస్తున్న బోధకులు ప్రసంగిస్తారన్నారు.

చాన్స్..చేంజ్.. చెరిష్



చాన్స్.. చేంజ్.. చెరిష్.. అనేది ఈ ఏడాది ఏపీఆర్ ఏఎస్‌సీ కాన్ఫరెన్స్ థీమ్. ఈ స్ఫూర్తితోనే మూడు రోజుల సదస్సు నిర్వహిస్తున్నాం. దీని ద్వారా విద్యార్థులతో పాటు బోధకులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే 200 మంది తమ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నారు. అతిథులు, వక్తలు, ఇతరులు కలిపి మొత్తం సుమారు 300 మంది ఈ సదస్సుకు హాజరుకానున్నారు.

– డాక్టర్ బి.రత్నభూషణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, హెచ్‌వోడీ, ప్లాస్టిక్ సర్జరీ, ఆర్‌ఎంసీ

పౌల్ట్రీఫారంలో రేషన్ బియ్యం సీజ్



వేలివెన్నులోని పౌల్ట్రీఫారంలో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన సివిల్ సప్లయి అధికారులు

ఉండ్రాజవరం: వేలివెన్నులోని జోగిరాజు పౌల్ట్రీఫారంలో 1,836 కేజీల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. ఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నూకగా ఆడించి కోళ్లకు మేతగా వాడుతున్నట్లు సమాచారం అందడంతో మండలంలోని పౌల్ట్రీలలో బుధవారం సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలివెన్నులోని జోగిరాజు పౌల్ట్రీఫారంలో 34 ప్లాస్టిక్ బ్యాగులలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. దీని విలువ రూ.79,866 ఉంటుందన్నారు. కోళ్ల ఫారం యజమాని ఎం.జోగిరాజు తండ్రి సుబ్బారావుపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం వేలివెన్ను గ్రామంలో రేషన్ షాపులను, ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. వాతావరణ పరిస్థితులు సరిగ్గా లేని కారణంగా వేలివెన్ను చుట్టు పక్కల గ్రామాల్లో రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని రైతులకు సూచించారు. తనిఖీలో సివిల్ సప్లయి డిప్యూటి తహసీల్దార్ సుధీర్ రెడ్డి, వెలివెన్ను వీఆర్వోలు మురళి, ఏసుపాదం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏమయ్యిందో పాపం

- ఉరి వేసుకుని ఒడిశా యువకుడి మృతి
- కొవ్వూరులో ఘటన

కొవ్వూరు: ఒడిశాకు చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని మృతి చెందాడు. పట్టణంలోని బాపూజీ నగర్ రామలక్ష్మి హైట్స్ అపార్టుమెంట్ మొదటి ఫ్లోర్‌లో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఐ.పంగిడి సమీపంలో త్రివేణి గ్లాస్ ఫ్యాక్టరీలో ఆడిటర్లు, ఫ్యాక్టరీకి సంబంధించిన ప్రముఖులు వచ్చినప్పుడు ఓ మాస్టర్ చెఫ్ వంట చేస్తారు. ఆయనకు సహాయకుడిగా ఏడాది నుంచి ఒడిశాకు చెందిన చందన్ బెహరా (19) అలియాస్ మంటూ పనిచేస్తున్నాడు. మాస్టర్ చెఫ్ మూడు రోజుల క్రితం ఒడిశాలోని తన సొంతూరికి వెళ్లాడు. మంటూకి సహాయకుడిగా దుష్యంత్ అనే యువకుడిని వారం రోజుల క్రితం తీసుకొచ్చారు. ప్రస్తుతం అపార్టుమెంటులో చందన్ బెహరా, దుష్యంత్, ఆడిటర్ ఉంటున్నారు.

వైరల్ ఫీవర్‌తో సతమతం

మంటూ మూడు రోజులుగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నాడు. అతడికి ఆర్‌ఎంపీతో వైద్యం చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మంటూ దుప్పటితో హాలులోని ఫ్యాన్‌కు ఉరి వేసుకోవడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో అలికిడి కావడంతో దుష్యంత్ నిద్ర లేచాడు. రూమ్‌లో ఉన్న ఆడిటర్‌ను నిద్రలేపి.. వారిద్దరూ కలిసి మంటూను అడ్డుకున్నారు. అతడికి కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఈ విషయాన్ని వెంటనే ఫ్యాక్టరీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మంటూ పక్కనే ఉన్న రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. తెల్లవారిన తర్వాత ఉదయం ఆరు గంటలకు తలుపులు కొడుతున్నా మంటూ తీయకపోవడంతో కంపెనీ ప్రతినిధులను సమాచారం అందించారు. పట్టణ సీఐ పి.విశ్వం, ఇతర సిబ్బంది సమక్షంలో తలుపులు పగలుకొట్టి చూడగా మంటూ ఫ్యాన్‌కు దుప్పటితో ఉరివేసుకున్నాడు. మృతదేహాన్ని కిందకి దించి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మంటూ మృతి చెందిన విషయాన్ని అతడి బంధువులకు సమాచారం అందించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అక్రమంగా నిల్వ ఉంచిన 1,987 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య తెలిపారు. ఎక్సైజ్ నార్త్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి ఆదేశాల మేరకు నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రెడ్డి త్రినాథ్, ఎస్సై రాజేష్, సిబ్బందితో కలిసి సుబ్బారావుపేటలోని ఒక ఇంటిపై దాడి చేశారు. అక్కడ నగరంలోని మల్లికార్జున నగర్‌కు చెందిన నేలతీటి సూర్యదీప్‌ను అరెస్టు చేశారు. ఆ ఇంటిలో నిల్వ ఉంచిన రూ.3,67,460 విలువైన 1,987 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

ఈ మద్యం ఎక్కడిది?

భారీగా పట్టుబడిన మద్యం సీసాలు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మద్యం షాపులు, బార్లను మూసివేశారు. ఈ నేపథ్యంలో ఎవరైనా మద్యంషాపు / బార్ యజమాని ముందస్తుగా ఈ సీసాలను జాగ్రత్త పరిచినట్లు తెలుస్తోంది. ఈ రెండు రోజుల పాటు వీటిని అధిక ధరకు విక్రయించాలనే ఉద్దేశంతో దాచినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం సీసాలపై ఉన్న బ్యాచ్, హీల్ నంబర్ ఆధారంగా అవి మద్యం డిపో నుంచి ఏ షాపునకు సరఫరా అయ్యాయో స్పష్టంగా తెలుస్తుంది. కానీ ఎక్సైజ్ అధికారులు ఆ విషయాన్ని గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తుంది. కాగా.. ఈ విషయంపై వివరణ అడిగేందుకు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి, ఎక్సైజ్ నార్త్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేయగా స్పందించ లేదు



రాజమహేంద్రవరంలో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ అధికారులు

239 మద్యం సీసాల స్వాధీనం

పి.గన్నవరం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం పి.గన్నవరంలో మూసివేసిన మద్యం షాపు వెనుక ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన 180 ఎంఎల్ పరిమాణం గల 239 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని మాట్లాడుతూ పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్‌లోని బాలాజీ వైన్స్ షాపు వెనుక బడ్డీలో కె.ఏనుగుపల్లికి చెందిన మట్టపర్తి ఫణికుమార్ బెల్టు షాపు నిర్వహిస్తున్నాడన్నారు. తమకు అందిన సమాచారంతో దాడి చేసి, అతడి నుంచి ఈ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.



పి.గన్నవరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సీఐ

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ టెన్త్ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్, డిగ్రీ, పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, MCA అన్ని యూనివర్సిటీల పరీక్షలు మా కాకతీయ విద్యాసంస్థలు, కాకినాడ దగ్గరలోని గొల్లపాలెంలో జరుగును. 100% పాస్ గైడెన్స్. మా ఆఫీసులు: కాకినాడ, రాజమండ్రి, రావులపాలెం. ఫోన్: 98495 82043, 99494 82757 [V- 2727]

Services

TANKER WANTED

■ తమిళనాడులోని (IOCL BPCL & HPCL) ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ లకు ఇథనాల్ సరఫరా చేయుటకు, PESO మరియు హజార్డ్స్ లైసెన్స్ తప్ప నిసరి, డ్రైవర్‌తో 40KL SS ట్యాంకర్ కావలెను. సంప్రదించండి: 7823963254 [IA-768]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2579]

Wanted

■ రాజమండ్రి, సర్పేపల్లిలో ప్రై॥ కం॥ & స్టార్ హోటల్స్‌లో సెక్యూరిటీ గార్డ్స్, సె॥ సూ॥ లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. రూం+భో జీ॥ 12 నుండి 15 వేలు. రాజ్ సెక్యూరిటీ దేవిచౌక్, రాజమండ్రి. ✆ : 93922 69369 & 99127 99369 [R-840]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14790]

■ కన్సల్టెన్సీ కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD.7995365999 [HA-99194]

■ కాకినాడ FOTON DOORS సంస్థ నందు పనిచేయుటకు Office Boy (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి ✆ : 88826 59999 [R-1260833]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోమ్ అవకాశం కలదు. 8121818692 [G-9098]

MindLeaders India
PEOPLE · PERFORMANCE · PROGRESS
MindLeaders Learning India Private Limited
Recruitment of Vocational Trainers (Contractual basis)
Mind Leaders Learning India Private Limited, an NSDC empanelled Training Partner invites application from Domicile of Andhra Pradesh for Vocational Trainers (VTs) for the Electronics trade/sector & Healthcare trade/sector under NSQF Program in 44 Govt. Secondary & Higher Secondary Schools of following districts of Andhra Pradesh & Vocational Coordinator in Andhra Pradesh.
Electronics- Vacancies (40), Districts- Bapatla (10), East Godavari (8) Eluru (5), Tirupati (8), & West Godavari (9)
Qualification: BE/BTech/MTech in Electricals/Electronics as a main subject, Diploma (3 years) in Electronics/ Electricals with 1-year work/ teaching experience. Age Limit: 21-37 years (as on 03/12/2024)
Healthcare- Vacancies (4), Districts- East Godavari (1), Eluru (1), Manyam (1), Visakhapatnam (1)
Qualification: B.Sc. Nursing and Midwifery (4 years) or 3½ years Diploma in GNM with one year experience. Age Limit:- 21-37 years (as on 03/12/2024)
Minimum Competencies for Vocational Trainer: Effective communication Skills (Oral and written) basic computing skills, technical competencies, soft skills, and facilitation skills.Candidate must be able to read and write in Telugu and English Languages.
How to Apply for the Post of Vocational Trainer: Eligible candidates must fill the details in the given Link or scan the QR code, https://forms.gle/inXDmRztug1sqx5H7, last date 12th Dec 2024
Vacancies for the Post of Vocational Coordinator in Andhra Pradesh
Qualification: Masters (3+2 or 4+2) with two year of experience at district level in manager/coordinator position, Age limit 25-37 years (as on 03/12/2024) How to Apply for the Post of Vocational Coordinator: Eligible candidates must fill the details in the given Link https://forms.gle/bURiGvcaTpoatfpc8, or scan the QR Code, last date 20th dec 2024.
Minimum Competencies for Vocational Coordinator: Effective communication Skills (Oral and written) basic computing skills, technical competencies, soft skills, and facilitation skills. Candidate must be able to read and write in Telugu and English Languages. Willing to work at any location within the state. Only shortlisted candidates will be called for the written test. For any Query email an: hr2@mindleadersindia.com, Website- www.mindleadersindia.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

9న డైట్‌లో కళా ఉత్సవ్ పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన కళా ఉత్సవ్ పేరిట ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎయిడెడ్, ప్రైవేట్, కేజీబీవీఏపీ మోడల్, ఉన్నత పాఠశాల ప్లస్‌లలో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నాట్యం, థియేటర్ ఆర్ట్స్, దృశ్య కళలు, సంప్రదాయ కథారీతులలో వల్లించడం తదితర ఆరు విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. గతేడాది (2023) జరిగిన కళా ఉత్సవ్ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినవారు ఈ ఏడాది పాల్గొనడానికి అనర్హులన్నారు. పాఠశాల తరఫున పోటీలలో పాల్గొనే వారి వివరాలను, పోటీ అంశాలను సూచించిన ప్రొఫార్మాలో ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్), బొమ్మూరు ఈ–మెయిల్ fdietef@fmai.comకు గానీ లేదా అధ్యాపకుడు రాజేష్ 94906 48110 వాట్సాప్ నంబర్‌కు ఈ నెల 7వ తేదీలోపు పంపాలన్నారు. అలాటే గాత్ర, వాద్య సంగీత పోటీలకు సంబంధించి ఎం.జానకీ దేవి (99125 22445), నాట్యం, థియేటర్ ఆర్ట్స్ పోటీలకు డాక్టర్ ఎస్.ఎస్తేర్ (94908 24226), దృశ్య కళలు, సంప్రదాయ కథారీతులలో వల్లించడం పోటీలకు జె.కళావతి (98492 11774)లను సంప్రదించాలన్నారు. ఆయా విభాగాల్లో ప్రథమ స్థానం పొందినవారు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు తదుపరి తెలిపే తేదీలలో తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై క్రిమినల్ కేసు

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డులో ఉన్న మండల లెవెల్ స్టాక్ (ఎంఎల్‌సీ) పాయింట్‌లోని రేషన్ బియ్యంలో అవకతవకలకు పాల్పడిన అప్పటి డిప్యూటీ తహసీల్దార్, ఎంఎల్‌సీ పాయింట్ ఇన్‌చార్జి గుత్తుల శ్రీనివాసరావుపై క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎల్‌సీ పాయింట్లో సుమారు రూ.1.79 కోట్ల విలువైన 375.513 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని అప్పటి ఇన్‌చార్జి శ్రీనివాసరావు పక్కదారి పట్టించారని ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో శాఖాపరమైన చర్యలు చేపట్టారు. రేషన్ బియ్యంలో అవకతవకలు జరిగినట్టు నిర్ధారణ కావడంతో ముమ్మిడివరం సివిల్ సప్లయిస్ అసిస్టెంట్ మేనేజర్ వి.నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీనివాసరావుపై వివిధ సెక్షన్లలో కేసు నమోదు చేసినట్టు బుధవారం ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోనసీమ రైస్‌మిల్లర్ల నిరసన

అమలాపురం రూరల్: కస్టమ్ మిల్లింగ్ ధాన్యం కేటాయింపులో ప్రభుత్వం తీరుతో తీవ్రంగా నష్టపోతున్నామని జిల్లాలోని రైసు మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కోనసీమ రైస్ మిలర్లు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం.. కస్టమ్ మిల్లింగ్ కోసం లోకల్ రైస్ మిల్లులకు కేటాయించకుండా సుదూర ప్రాంతాలలోని రైస్ మిల్లులకు పంపిస్తోందన్నారు. దీనివల్ల తాము పనిలేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము పదేళ్లుగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎమ్ఆర్)పై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. గతంలో ఇక్కడ పండిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం తమకే కేటాయించేవారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ విధానానికి భిన్నంగా మిల్లు కెపాసిటీ ఆధారంగా టార్గెట్ ఇస్తున్నారని తెలిపారు. తమకు సీఎంఆర్ కేటాయింపులో అన్యాయం చేస్తున్నారన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు జిల్లా ఉపాధ్యక్షుడు దివి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మిల్లర్లు వినతిపత్రం అందించారు.

ఆన్‌లైన్‌లో సైబర్ గాలం

- అధికారుల పేరుతో నేరగాళ్ల మోసాలు
- చిక్కుకుంటే తిప్పలే

అల్లవరం: పెరిగిన టెక్నాలజీతో అన్ని పనులను ఎంతో సులభంగా చేసుకునే వీలు కదిలింది. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు ఇంటిలో కూర్చుని అన్ని లావాదేవీలు చేసుకోవచ్చు. ఇదే క్రమంలో ఆన్‌లైన్లో సైబర్ నేరాలు బాగా పెరిగిపోయాయి. వివిధ రకాల పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్నారు. గతంలో బ్యాంకు అధికారులమంటూ చెప్పి, ఓటీపీ నంబర్లు అడిగి మోసాలకు పాల్పడేవారు. వాటిపై ప్రజలకు అవగాహన పెరగడంతో కొత్త విధానాలను అవలంబిస్తున్నారు.

▸▸ సైబర్ నేరగాళ్లు తొలుత మన డేటాను చోరీ చేస్తున్నారు. దాని పరిశీలించి అమ్మాయిలతో వాట్సాప్‌ల ద్వారా హాయ్ అంటూ మేసేజ్‌లు చేస్తూ వల వేస్తున్నారు. ఇది మోసమని తెలియని వ్యక్తులు వారి ఉచ్చులో పడుతున్నారు. వారి బెదిరింపులకు భయపడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు.

▸▸ అల్లవరం మండలం దేవగుప్తంలో ఓ ఉపాధ్యాయురాలికి ఇటీవల ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మీ అబ్బాయి గంజాయి కేసులో అరెస్టు అయ్యాడని చెప్పాడు. కేసు నమోదు కాకుండా ఉండాలంటే లక్ష రూపాయలు ఫోన్ పే చేయాలని బెదిరించాడు. భయపడిన ఆమె వెంటనే రూ.85 వేలు ఫోన్‌పే చేసింది. తీరా అబ్బాయికి ఫోన్ చేసే సరికీ అది మోసమని తెలిసింది.



సీబీఐ అధికారిని అంటూ బెదిరింపులకు పాల్పడిన సైబర్ నేరగాడు

▸▸ ఓ కిరాణా వ్యాపారికి సింగ్ అనే వ్యక్తి ఫోన్ చేసి మీరు మొబైల్‌లో పెట్టిన వీడియోలు తమ దగ్గర ఉన్నాయని, వెంటనే అల్లవరం పోలీస్ స్టేషన్‌కు రావాలని ఆదేశించాడు. మీ మీద కేసు నమోదయ్యిందని బెదిరించాడు. అయితే కిరాణా వ్యాపారి కంగారు పడకుండా ఆ ఫోన్ నంబర్‌ను పోలీసులకు అందజేశాడు. వారు విచారణ చేయగా అది సైబర్ నేరగాడి పని అని తేలింది.

▸▸ దేవగుప్తం హైస్కూల్ వద్ద నివాసం ఉంటున్న వాసర్ల లక్ష్మణరావుకు బుధవారం ఉదయం ఓ అపరిచితుడు ఫోన్ చేశాడు. మీ అబ్బాయి కంపెనీలో చోరీ చేశాడని, ఎక్కడ ఉన్నాడో చెప్పాలని, అరెస్టు చేయాలని బెదిరించాడు. సీబీఐ అధికారి నుంచి ఫోన్ రావడం ఏమిటని లక్ష్మణరావు మొదటి ఆందోళనకు గురయ్యాడు. అయితే తెలివిగా వ్యవహరించి గట్టిగా మాట్లాడడంతో అపరిచితుడు ఫోన్ పెట్టేశాడు.

సైబర్ నేరగాళ్ల వలలో కాంట్రాక్టర్

శంఖవరం: ఓ కాంట్రాక్టర్‌ను సైబర్ నేరగాళ్లు మోసం చేసి రూ.5.20 లక్షలు కాజేశారు. అన్నవరం ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల మేరకు.. శంఖవరం గ్రామానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ తన వ్యాపారం నిమిత్తం సిమెంట్ లోడు కోసం ఆన్‌లైన్ లో వెతికాడు. దీంతో సైబర్ నేరగాళ్లు ఆయనను టార్గెట్ చేశారు. తక్కువ ధరకే సిమెంట్ విక్రయిస్తామని నమ్మించి రూ.5,20,000 కాజేశారు. కాంట్రాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నవరం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అపరిచితులు ఫోన్ చేస్తే జాగ్రత్తగా మాట్లాడాలి. పోలీసులమని చెప్పి బెదిరింపులకు పాల్పడితే భయపడకూడదు. వారికి డబ్బులు పంపించకూడదు. వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలి.

– హరీష్ కుమార్, ఎస్సై, అల్లవరం

ఆంధ్రా క్రికెట్ జట్టుకు కోనసీమ కుర్రోడు

పి.గన్నవరం: ఆంధ్రప్రదేశ్ అండర్–23 క్రికెట్ జట్టుకు పి.గన్నవరానికి చెందిన లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ పడాల వంశీనారాయణ ఎంపికయ్యాడు. కడపలో గత నెల 24 నుంచి 30 వరకూ జరిగిన ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన వంశీనారాయణ ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ టోర్నమెంట్‌లో వంశీ మొత్తం ఐదు మ్యాచ్‌లు ఆడి 12 వికెట్లు తీశాడు. జార్ఖండ్‌లో ఈ నెల 13 నుంచి జరిగే అండర్ – 23 రాష్ట్ర స్థాయి పోటీలలో వంశీనారాయణ పాల్గొంటాడు. లెఫ్ట్‌హ్యాండ్ స్పిన్నర్‌గా, మిడిల్ ఆర్డర్ బాట్స్‌మెన్‌గా రాణిస్తున్న వంశీని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యనారాయణ, రఫీ, కోచ్‌లు మట్టా సత్తిబాబు, వెంకట నగేష్, గ్రామస్తులు అభినందించారు.



వంశీనారాయణ

సొసైటీ సీఈఓ ఆత్మహత్యాయత్నం

మలికిపురం: మండలంలోని గూడపల్లి ప్రాథమిక సహకార సంఘం సీఈఓ నూకల వీర వెంకట సత్యనారాయణ బుధవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయనను వెంటనే రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు వెంటనే చికిత్స అందించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు రాలేదన్నారు. రాజోలు డీసీసీబీ మేనేజర్ మల్లాడి వీర వెంకట సత్యనారాయణ అలియాస్ స్టీవెన్ పాల్ వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పీవీవీ సురేష్ తెలిపారు. కాగా.. దీనిపై డీసీసీబీ మేనేజర్ స్టీఫెన్ పాల్ మాట్లాడుతూ గూడపల్లి సొసైటీ రికార్డులను కంప్యూటరైజేషన్ చేయడంలో సత్యనారాయణ వెనుకబడి ఉన్నారనినారు. రికార్డులు సక్రమంగా లేవన్నారు. ఆయన గత సెప్టెంబర్ వరకూ జీతం తీసుకున్నారన్నారు.



రాజోలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గూడపల్లి సొసైటీ సీఈఓ సత్యనారాయణ

గ్యాస్ లీకై టీ షాపు దగ్ధం

కొత్తపల్లి: ఉప్పాడలోని సురేష్ ఉప్పాడ శారీస్ పక్కనే ఉద్దండు సత్తిబాబు నిర్వహిస్తున్న టీ ట్రెండ్ షాపులో బుధవారం గ్యాస్ లీకైంది. దీంతో దుకాణంలో మంటలు రేగాయి. స్థానికుల సమాచారంతో పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షలు విలువ చేసే సామగ్రి కాలిపోయింది.



టీ దుకాణం నుంచి వెలువడుతున్న మంటలు